# నింగినుండి నేలకు

పవని నిర్మల ప్రభావతి



విమానం ఆకాశంలో దూసుకుపోతోంది.

అందులో ప్రయాణిస్తున్న డాక్టర్ అంజిరెడ్డి ఆలోచనలు కూడా అంత వేగంగానూ దూసుకుపోతున్నాయి. ఓ గంటలో ఈ విమానం తన జన్మభూమి అయిన భారతదేశంలోకి అడుగెడుతుంది. ఆ తర్వాత మరో రెండు గంటల్లో హైదరాబాదు నగరంలోని విమానాశ్రయంలో 'లాండ్' అవుతుంది. అప్పుడు తనీ గగనగమనంలోనుంచి, నేలమీదకు దిగుతాడు. నింగిమీదనుంచి నేలమీద దిగిన తనకు స్వాగతసత్కారాలు పలకటానికీ, జరపడానికీ తన భార్య, పిల్లలు, తల్లి, తండ్రి, తన బంధువర్గమూ, స్నేహితబృందమూ, పూలమాలలతో, చిరునవ్వులతో నిలిచివుంటారు.... కానీ ఆ నవ్వులలో, ఆ పూలమాలలలో తనకు కనిపించేది నిజమైన ఆప్యాయత కాదు, కేవలం డబ్బు.... డబ్బు....! నైతికంగా నింగినుండి నేలకు దిగజారిన తన జీవితపు విలువలకూ, ఆదర్శాలకూ హారతిపస్తున్న ఆ మనుషులలో తనకెవరూ ఆత్మీయులు లేరు.... కానీ, ఆ నగ్నసత్యం తెలిసీ, తనిలా ప్రతి సంవత్సరం వస్తూనే వున్నాడు. ఎందుకు? ఇంకా తన జన్మభూమిపట్ల వదలని మమకారం ఒక్కటే తననిలా రప్పిస్తోంది. అసలిలా ఎందుకు జరిగింది?

అంజిరెడ్డి తలలో విమానం ప్రొపెల్లర్‌లా గతం తిరగటం మొదలెట్టింది. అది దృశ్యాలుగా కనిపిస్తోంది మనోనేత్రాలముందు. అతగాడు ఓ సినిమా చూస్తున్నట్లు, తనో ప్రేక్షకుడిగా మిగిలిపోయి చూస్తున్నాడు గతం తాలూకు దృశ్యాల్ని.

రాఘవరెడ్డి ఆ గ్రామంలో కలిమికీ, బలిమికీ లోటులేని భూస్వామి. ఆయనకు ఇద్దరు కొడుకులు. రామిరెడ్డి, అంజిరెడ్డి. ఇద్దరు కూతుళ్ళు. లక్ష్మమ్మ, రావమ్మ. కూతుళ్ళిద్దరికీ, బంగారం పండే ఐదేసి ఎకరాల మాగాణి భూమి కట్నం, కానుకలుగా యిచ్చి, ఆ రోజుల్లో ఘనంగా పెళ్ళిళ్ళు చేసి, కాపురాలకు పంపేశాడు. ఇప్పుడు వాళ్ళిద్దరూ ఒక్కొక్కరూ నలుగురేసి బిడ్డలతో సుఖంగా వుంటున్నారు. రామిరెడ్డికి చదువంటలేదు. అతగాడు ఇంటిపట్టునే వుండి, వ్యవసాయం చేయిస్తుంటాడు.

ఇక అంజిరెడ్డి మాత్రం చిన్నప్పట్నుంచీ చదువులో ఫస్టుక్లాసులో రావటం మొదలెట్టాడు. రాఘవరెడ్డి, ఆయన భార్య కనకమ్మల ఆశలన్నీ అంజిరెడ్డిమీదే నిలిచిపోయాయి. కొడుకు ఓ పెద్ద డాక్టర్ కావాలి.... లక్షలు కట్నం తేవాలి. తాము గర్వంగా బంధువర్గంలో కీర్తింపబడాలి. ఇదే ఆలోచన వాళ్ళిద్దరికీ. డాక్టర్‌కోర్సులో చేరిన అంజిరెడ్డి ఆలోచనలు మాత్రం మరో విధంగా వున్నాయి. చిన్నతనంనుంచి తన గ్రామంలోనూ, చుట్టుప్రక్కల గ్రామాలలోనూ ఎంతో మంది గృహిణులు కాన్పుల్లో చనిపోవటం, బాలింతరాళ్ళుగా బాలింత జబ్బువచ్చి చనిపోవటం అతగాడు కళ్ళారా చూశాడు. అవన్నీ భూతప్రేతాల చేష్టలంటూ మంత్రాలు వేయించే వాళ్ళ అజ్ఞానాన్నీ, అవిద్యనీ చూచి జాలిపడేవాడు. ఆరో కాన్పులో చనిపోయే తల్లులు, ఏడో కాన్పులో చనిపోయే తల్లులు.... ఆ దిక్కులేని బిడ్డలు.... పోషకాహారం అందక, అధిక సంతానంవల్ల అనారోగ్యాలతో ఈసురోమంటున్న పిల్లలు, భారమైన కుటుంబాలు చూచేకొద్దీ, అత

గాడి హృదయం గిలగిలలాడసాగింది. గత ముప్ఫై సంవత్సరాలలో సైన్సు ఎంతో ప్రగతి సాధించింది. అధిక సంతానాన్ని అరికట్టి, పరిమిత కుటుంబాలని ఏర్పరచుకొనే వసతులెన్నో కల్పింపబడ్డాయి. అయితే ఇంకా గ్రామ ప్రాంతాలలోని ప్రజలకు మాత్రం మూఢనమ్మకాలు వదలలేదు. అంచేత తను డాక్టర్ కోర్సు పాసై, స్టెరిలైజేషన్, వేసక్టమీ, లెప్రోస్కోపిక్ వగైరా ఆపరేషన్స్‌లో ట్రైనింగ్ అయి, ఈ గ్రామ ప్రాంతాలలోనే డాక్టరుగా స్థిరపడి, తన చుట్టూరా వున్న అమాయకులైన ప్రజలకి తన ఓపికనంత సేవ చెయ్యాలి. ఆ విధంగా తన మాతృభూమికి ఓ డాక్టరుగా, ఓ బాధ్యతగల వీరునిగా కొంత ఋణం తీర్చుకోవాలి... అలా దృఢనిశ్చయం చేసుకొన్న అంజిరెడ్డి, డాక్టర్ కోర్సుపూర్తి చేసుకొని డాక్టర్‌గా ఇంటికి వచ్చాడు. ఇక సిటీలో నర్సింగ్‌హోం కట్టడానికీ, దానికావలసిన 'ఎక్విప్‌మెంట్' అంతా తాము కట్నం రూపంలో ఇస్తామంటూ ఆడపిల్లల తండ్రులు లక్షల రేట్లు పెంచి ఇంటిచుట్టూరా తిరగటం మొదలెట్టారు. అంజిరెడ్డి మాత్రం ససేమిరా తనకు కట్నం వద్దన్నాడు. తనకీ డిగ్రీ వేలం పాట కాదు పొమ్మన్నాడు. రాఘవరెడ్డి, కనకమ్మ నిర్ఘాంతపోయారు. ఐదులక్షల రొఖ్ఖం వద్దనటమేంటీ చాదస్తుడు? అక్కలిద్దరూ బాధపడ్డారు ఆడపడుచు లాంఛనాలుగా తమకి చెరో పాతికవేలు వస్తాయనే ఆశ పోయిందని... మొత్తంమీద శారదను పెళ్లాడటానికి అంగీకరించాడు. శారద తన ఆదర్శాలకూ, ఆశయాలకూ సహకారమూ, ప్రోత్సాహమూ ఇస్తుందని ఆశించాడు. శారద తండ్రి అయ్యపురెడ్డి, శారద పేరుతో ఓ యాభైవేల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్టు వేసి, శారదకు నగలరూపంలో మరో పాతికవేలు ఇచ్చి, ఆడబడుచు లిద్దరికి చెరి ఐదువేలు సమర్పించుకున్నాడు లోపాయికారీగా. అయితే, కనకమ్మకీ, రాఘవరెడ్డికీ శారద తెచ్చిన 'తక్కువ' కట్నకానుకలు తృప్తినివ్వలేదు కానీ, అంజిరెడ్డి ఆ మాత్రంకూడా ఇవ్వలేనివాళ్ల పిల్లని చేసుకుంటాడేమో ననే భయంతో మాత్రమే ఒప్పుకున్నారా పెళ్లికి. తమ గ్రామం వుంటున్న సమితిలోనే డాక్టర్‌గా ఉద్యోగం సాధించాడు అంజిరెడ్డి... ఓ జీపు, మరో లేడీడాక్టర్ శ్రీదేవి, ఆయా లక్ష్మి, గ్రామసేవిక రాజ్యం, ప్యూను మల్లయ్యలతో, గ్రామ గ్రామానికి వెళ్లి ఆపరేషన్ల అవశ్యకతను గురించి బోధించటం, ఎక్కువమందిని ఆపరేషన్లకు ఒప్పించటం, ఆపరేషన్లు చేయటం అనేది ఉద్యమంలా మొదలెట్టాడు. చాలా సమితుల్లో, సమితి సెంటర్లలోనే కూర్చుని తాము గ్రామాలకు వెళ్లి వచ్చినట్లు డైరీలు వ్రాసుకొనే డాక్టర్లు, గ్రామసేవికలు, ఆయాలూ వుండగా పిచ్చివాడిలా దుమ్ముకొట్టుకొంటున్న రోడ్లమీద జీపులో మారుమూల గ్రామాలకి కూడా వెళ్లి వస్తున్న కొడుకు వాలకం రాఘవరెడ్డికి చికాకు కలిగించింది. ఇంటిపట్టున వుండి, కాస్తంత జబ్బుని కొండంత జబ్బుగా వర్ణించి, లేదా మందులతో జబ్బుని పెంచి, డబ్బు గుంజవచ్చుగా? ఈ పల్లెటూరివాళ్లకేం తెలీదు కదా! అలా అయినా డబ్బు దండిగా సంపాదించుకోవచ్చు గదా? అదీ 'తప్పు' అంటాడేమిటీ మూర్ఖుడు... ఐదేళ్లు గిర్రున తిరిగాయి. అంజిరెడ్డి, శారదలకు ఓ పాప, బాబు పుట్టారు. ఈలోగా దేశంలోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. మనుషులలో 'ఈజీ మనీ' పట్ల మోజు విపరీతమైంది. అందాకా రాఘవరెడ్డి దగ్గర పనికుర్రాడిగా పనిచేస్తున్న కోటిరెడ్డి అనేవాడు, ఐదేళ్ల క్రితం గల్ఫ్ దేశాలకు వెళ్లాడు కూలీగా, ఓ ఏజంటు సాయంతో. మరో సంవత్సరం కోటిరెడ్డే ఐదారు 'కూలిముఠాలని' ఏర్పరచుకొని తను మేస్త్రీగా వెళ్లిపోయాడు. ఐదేళ్లలో కోటిరెడ్డి, ఇక్కడ తమ ఆవరణక్కాస్త దూరంలోవున్న పూరిల్లు స్థానంలో మేడ కట్టించేశాడు. అన్నానికి కటకటాలు పడుతున్న ఆ కుటుంబం ఇప్పుడు మంచాలమీద, స్టీలు కంచాలలో భోజనాలు చేస్తోంది... అదే కడుపు మండిస్తోంది కనకమ్మకీ, రాఘవరెడ్డికీ.

"లక్షల కట్నం వద్దన్నావు. సరిపెట్టుకున్నాము. మన కళ్లముందు కోటిగాడు మేడ కట్టాడు. నువ్వూ వున్నావు ఎందుకూ? ఇంత చదువూ చదివి– ఇంటిపట్టున పడివున్నావు. కోటిగాడికున్న ముందుచూపు, చొరవా వుంటే, నువ్వీపాటికి ఆరు బంగళాలు కట్టకపోయావా? మా ఖర్మ! బిడ్డలు పుట్టగానే సరికాదు..." అంటోంది తల్లి రోజూ.

నూతిగట్టుమీద కూర్చొని, ఉదయిస్తున్న సూర్యుణ్ణి, చిరుగాలికి వూగే కొబ్బరి మట్టల్ని, నిమ్మచెట్టు మీదనుంచి వచ్చే సువాసననీ, మామిడిచెట్ల పూతనీ చూస్తూ, ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ, మైమరచిపోయే అంజిరెడ్డికి తల్లిమాటలు కొరడా దెబ్బల్లా తగుల్తుంటాయి.... తన తల్లి! బిడ్డ కళ్ళముందు వున్నాడన్న సంతోషం లేదు సరిగదా గల్ఫ్ దేశాలకో, ఆస్ట్రేలియాకో, అమెరికాకో పోయి– లక్షలు గడించలేదన్న అక్కసు కురిపిస్తోంది! ఇది కాలప్రభావమా? కోటిగాడు రహస్యంగా వాడి అనుభవాలని తనతో చెప్పుకున్నాడు. ఆ దేశాలలో వాడు అనుభవించిన కష్టాలు, తిన్న కొరడా దెబ్బలు, హీనంగా చూడబడ్డ సన్నివేశాలూ, ఏజంట్ల మోసాలూ... వాడికీ, దేవుడికీ తెలుసు. అయితే వాడు కట్టిన మేడ ఒక్కటే వాణ్ణిప్పుడు గొప్పచేసి చూపిస్తోంది....



శారదలోనూ చాలా మార్పు వచ్చింది. మొదట్లో తన ఆదర్శాలను అర్థంచేసుకుందనుకున్న శారద, ఈ మధ్య చాలా మారిపోయింది. శారద అన్న నరసింహారెడ్డి ఇంజనీరుగా వుంటూ రాజీనామా చేసి గల్ఫ్‌దేశాలకు వెళ్లాడు. శారద వదినె రాధిక ఇక్కడే వుండిపోయింది ఇద్దరు పిల్లలతో. ఐదారేళ్లలో రాధిక సిటీలో ఐదులక్షలు ఖరీదుచేసే బంగళా కొన్నది భర్త పంపే డబ్బుతో. కారు కొన్నది. కలర్ టి.వి., ఫ్రిజ్.. వీ.సి.ఆర్., ఫారిన్ చీరెలు, నగలు, ఫారిన్ సెంట్లు .... ఒకటేమిటి? ఆ బంగళా ఓ మయసభలా వుంటుంది. "మీవారిలాగే మడిగట్టుక్కూర్చోకపోతే, మీ అన్నయ్యలా ఆ దేశాలకు వెళ్లకూడదా శారదా? డబ్బు చేదా? మన బిడ్డలకి మనం లక్షలు సమకూర్చి పెట్టుకోవటం మన కర్తవ్యం కాదా? దేశమంటాడు- ప్రజలంటాడు- ఏమిటో పైత్యం మీ వారికి. అసలు నిస్సనాల. భార్య పోరు పెడితే భర్త వింటాడు. నువ్వలాగైనా ఎలాగో ఒప్పించి పంపించు. నా పిల్లలిద్దరూ ఢిల్లీలో గొప్ప కాన్వెంటులో చదువు

తుంటే, నీ పిల్లలు ఆ పల్లెటూరి బడిలో 'ఓనమాలు' దిద్దబోతున్నారు," అంటుంది తరచూ హేళనగా. అన్న నరసింహారెడ్డి కూడా చెల్లెలికి భారీ కానుకలు తెచ్చిస్తూ, బావగారి అసమర్థత గురించి హేళనచేస్తాడు... అంతే! శారదకిక పట్టలేని ఆగ్రహం వస్తుంది భర్త మీద. "వెధవ పల్లెబ్రతుకు. పిల్లలీ మట్టిలో- పాడైపోతున్నారు. వెధవ అపరేషన్లూ, పన్లూ, మీరూను!" అంటూ సాధిస్తోంది. విని విని విసిగెత్తిపోయాడు అంజిరెడ్డి.

"మన కిప్పుడొచ్చిన లోటేమిటి శారదా? పాడి, పంట, స్వచ్ఛమైన గాలి, నీరు, సర్వసంపదలూ వున్నాయి. పిచ్చి డబ్బు మోజుతో అందరూ సిటీలకు ఎగబడటంవల్ల అక్కడ వాతావరణ కాలుష్యం, ధ్వని కాలుష్యం, నీటికొరత, చివరకు స్వచ్ఛమైన గాలికొరత కూడా ఎలా ఏర్పడ్డాయో తెలుసా? మన బిడ్డలు ఆ కాలుష్యాలకు దూరంగా ఆరోగ్యంగా, హాయిగా పెరుగుతున్నారు. చదువులంటావా? వాళ్ల అభిరుచుల్ని గమనించి చెప్పిద్దాము.

"శారదా! మనిషి ఆశకి మితిలేదు. విలాసప్రలోభాలకు అంతుండదు. అన్నీ వున్నా మీ అన్నావదినెలకు ఇంకా ఇంకా కావాలన్న ప్రలోభమే తప్ప తృప్తి వుందేమో చూడు. మన బిడ్డలకు మనం ఇవ్వవలసింది లక్షల ఆస్తి, డబ్బు, విలాస జీవితమూ, బాధ్యతారహితమైన దృక్పథమూ కాదు శారదా! ఈ. మన జన్మభూమిపట్ల గౌరవం, భక్తి, మానవ జీవితంలో నిజమైన నైతిక విలువల పట్ల దృఢమైన విశ్వాసం, సత్సంస్కారం... అవి శారదా! తరతరాలకీ ఉన్నత వారసత్వంగా ఇవ్వవలసిన భావబీజాలివి... పిచ్చి డబ్బూ, ఈజీ మనీపట్ల మోజు కాదు సుమా!" అన్నాడు... శారద ఛర్రుమంది. "సర్లెండి. మీ సిద్ధాంతాలు మీవి. నేను మా వదినెదగ్గర వుంటాను పిల్లలతో. ఢిల్లీ కాన్వెంటుల్లో పిల్లలని చేర్చకున్నా, హైద్రాబాదు కాన్వెంటుల్లో అయినా చేర్పిస్తాను!" అంది. నిర్ఘాంతపోయాడు అంజిరెడ్డి. మేడ దిగి వచ్చాడు.

ఆరోజే తండ్రి రాఘవరెడ్డి స్పష్టంగా చెప్పాడు. "ఒరేయ్ అంజిరెడ్డీ! ఏజంటు మాధవరావు ఇంటిచుట్టూ తిరిగిపోతున్నాడు నిన్నూ ఆ దేశాలకు వెళ్లే డాక్టర్ల లిస్టులో చేర్చటానికి. ఎవరికో ఒకరికి ఆ అవకాశం ఇవ్వొచ్చు అతగాడు. కానీ, ఒకప్పుడు నేను ఇచ్చిన డబ్బు సాయంతో, వాళ్ల కుటుంబం పైకివచ్చిందన్న కృతజ్ఞతతో మాత్రమే నీకీ సాయం చేస్తానంటున్నాడు. ఏమైనా ఈ సారి నువ్వు అంగీకారం తెలిపి తీరాలి. లేదంటావా? నేను వురేసుక ఛస్తాను. నేను పోయాక మీ అమ్మ క్షణం బతకదు. తలిదండ్రుల్ని చంపిన గొప్ప ఆదర్శవంతుడిగా బ్రతుకుదువుగాని తర్వాత!" అన్నాడు. ఏమిటి వీళ్ల బాధ! తాము తిని, పదిమందికి పెట్టగలిగినంత పొలమూ, సంపదా, సేద్యమూ వున్నాయి. కానీ అవి చాలవు! ఇంకా ఇంకా కోట్లు కావాలి. దేశంలో సగటు మనిషి ఎంత పేదరికం అనుభవిస్తున్నాడో వూహించు కోరేం? తా మొక్కడే డబ్బు పాతర వేసుకోవాలని ఆరాటం! ఛ.... ఛ....

అన్యమనస్కంగా జీపులో కూర్చున్నాడు డ్రైవర్ ప్రక్కనే. వెనక సీట్లలో కూర్చున్న డాక్టర్ శ్రీదేవి, ఆయా లక్ష్మి, గ్రామసేవిక రాజ్యం, ప్యూను పుల్లయ్య అభివాదం చేశారు మర్యాదగ. జీపు కదిలింది గతుకుల రోడ్డువేపు. డాక్టర్ శ్రీదేవి అంది, "ఈ రోజు మనం వెళ్లే గ్రామం అసలు రోడ్డుసౌకర్యమే లేదట డాక్టర్! ఆ గతుకుల్లో ఈ జీపులో పడి వెళ్లేసరికి ఒళ్లు హూనం అయిపోతుంది. ఇంతా చేసి మనం చేస్తున్న ఈ ఆపరేషన్లు తమ మంచికే ననుకోరు ఈ పల్లెప్రజలు. మనకు జరక్కా చేస్తున్నా మనుకుంటారు. గుక్కెడు మంచినీళ్లివ్వటానిక్కూడా ఏడ్చిపోతారు. ఈ గ్రామం సర్పంచ్ కాస్త మంచివాడట. మనకి భోజనవసతి సౌకర్యాలు కల్పిస్తానని కబురుపంపాడు. ఏం ఉద్యోగమో డాక్టర్! ప్రాణాలు పోతున్నాయి. ఆస్ట్రేలియా- నైజీరియా వెళ్లే డాక్టర్ల లిస్టులో నా పేరు వేయమని చెప్పాను ఏజంటు మాధవరావుకు. అవసరమైన కాగితాలమీద రేపు కాంపు నుండి వచ్చాక సంతకాలు చేస్తానని చెప్పాను. ఇక్కడ ఎంతకాలం వున్నా ఓ గుర్తింపా? ఓ డబ్బా? ఓ హోదానా? ఏముంది డాక్టర్! హాయిగా అలా వెళ్లామంటే లక్షల డబ్బు.... మీరూ రండి డాక్టర్!"

"నేనా? ఆలోచిస్తున్నా!" నిర్లిప్తంగా అన్నాడు.

"ఆలోచన వద్దు డాక్టర్! మీరు తోడుంటారనే ధైర్యంతోనే నేను మాధవరావుకు మాట చెప్పాను. ప్లీజ్ కాదనకండి!" అంది డాక్టర్ శ్రీదేవి.

శ్రీదేవి వాళ్లది పేదకుటుంబం. ఆ కుటుంబానికి ఆమే పెద్దమ్మాయి; తల్లిదండ్రుల్నీ ఇద్దరు చెల్లాయిలనీ, ఇద్దరు తమ్ముళ్లనీ ఆమే పోషించాలి.

"ఈ ఆపరేషన్స్ చేస్తుంటే నా కనిపిస్తుంటుంది డాక్టర్! ఏభై సంవత్సరాల క్రితమే సైన్స్ ఇంతగా డెవలప్అయి వుండివుంటే, మా కుటుంబంలా భారమైన కుటుంబాలు వుండేవి కావేమోనని.... ఎలాగైనా ఈ తరం అదృష్టవంతమైనతరం...." అంది మళ్లీ డాక్టర్ శ్రీదేవి.

"అవును శ్రీదేవీ! అందుకే ఆ అదృష్టాన్ని అందరికీ పంచే అవకాశం మనకుంది. ఇదీ ఓ గొప్ప అదృష్టం కాదా?" అన్నాడు అంజిరెడ్డి ఆవేశంగా.

"నో.... నో! ఇలా ఇక్కడే వుండిపోతే, ఏనాటికీ బాగుపడం డాక్టర్.... మనం వెళ్ళాల్సిందే! మీ శ్రీమతిగారు కూడా చాలా బాధపడ్తూ చెప్పుకొచ్చారు మొన్న వో రోజు...." జీపు గ్రామం చేరింది. ఆ రోజంతా అన్యమనస్కంగా వుండిపోయాడు డాక్టర్ అంజిరెడ్డి.

వీళ్ళందరికీ కావల్సిందేమిటి? డబ్బు.... డబ్బు.... డబ్బు.... తను కాదు. తన ఆదర్శాలు కాదు. ఇప్పుడిప్పుడే జీవితపు విలువలు, నైతిక విలువలు "డబ్బు"తో కప్పబడి- సమాధి చేయబడుతున్నాయి.

తన పాప ముద్దు మాటల్నుంచి తను దూరంగా వెళ్ళాలి. తన బాబు బోసి నవ్వుల్నుంచి తను తరిమివేయబడాలి. శారద- పేలటానికి సిద్ధంగావున్న అగ్ని పర్వతంలా వుంది. అది పేలకముందే తను దూరంగా వెళ్ళిపోవాలి. తల్లిదండ్రులలో మాతృవాత్సల్యం, పితృ మమత డబ్బు ప్రలోభం మాటున సమాధి అయిపోగా, ఇక వాళ్ళకి తనేమీ కాడు! ఛః తల్లిదండ్రుల ఋణం కేవలం డబ్బు మూటలతో తీర్చాలి. తన ఆదర్శాలు చంపుకోవాలి.... వీళ్ళందరి కోరికా, సాధింపూ, అంతా అదే! మర్నాడే తన అంగీకారం ఏజంటు మాధవరావుకు తెలిపాడు డాక్టర్ అంజిరెడ్డి. శ్రీదేవి అభినందించింది ఆనందంగా....

పదేళ్ళు గిర్రున తిరిగిపోయాయి కాలచక్రంలో.... డాక్టర్ అంజిరెడ్డికిప్పుడు సిటీలో రెండు బంగళాలున్నాయి. రెండు కార్లున్నాయి. బంగళాలు రెండూ, నరసింహారెడ్డికున్న సంపదకన్నా రెండు రెట్లు అధికమైన సంపదతో తులతూగుతున్నాయి. శారదకిప్పుడెంతో గర్వంగా వుంది. బంధువర్గంలో ఆమె ఓ మనీ దేవత. మినీదేవత. తల్లి, తండ్రి పల్లె వదిలి సిటీకి వచ్చారు. అతను వస్తే- ఎవరో పరాయి ప్రముఖుడికి వంగివంగి దణ్ణాలు పెట్టినట్లు, బెదురుతూ బెదురుతూ మర్యాదలు చేస్తున్నారు. ఒకప్పుడు సిగరెట్ వాసన కూడా భరించలేకుండిన అంజిరెడ్డి ఇప్పుడు చెయిన్ స్మోకర్. ఫారిన్ విస్కీ- తలిదండ్రులముండే, భార్యాబిడ్డలముండే త్రాగినా, వాళ్లేమీ అనుకోవటంలేదు. అది తప్పనుకోవటం లేదు. దాంపత్యజీవితానికి దూరంగా పరాయిదేశంలో వారాలు నెలలు గడపటంలో.... ఏర్పడిన ఏకాకితనంలో, చికాకులో, సన్నిహితంగావున్న డాక్టర్ శ్రీదేవితో మొదలైన ప్రణయం, మరెన్నో "వుమెన్ వీక్‌నెస్"కు దారితీసింది. అదీ వీళ్ళందరికీ తెలుసు. అయినా బాధపడరు. ఈ దరిద్రపు వ్యసనాలు- వ్యసనాలనిపించటంలేదు వాళ్ళకి.

పిల్లలిద్దరూ "ఋషీవాలీ"లో చదువుతున్నారు. పిల్లలకి తనేమీ కాడు. తనకి వాళ్ళేమీ కారు. ఎప్పుడో వాళ్ళు టేప్ రికార్డర్‌లో మాట్లాడి పంపిన చిలక పలుకులు (ఒకే మాటలు) విని విని విసుగెత్తుతుంది.

తనో డబ్బు యంత్రం. అంతే! "ఆకాశంబుననుండి శంభుని శిరంబందుండి- సీతాద్రి సుశ్లోకంబైన హిమాద్రినుండి- భువి- భూలోకమునుండి- పవనాంధోలోకము.... జేరె- గంగా కూలంకష. పెక్కు- భంగులు వివేకభ్రష్ట సంపాతముల్!"

భర్తృహరి సుభాషితం ఎప్పుడూ మదిలో మెదుల్తుంటుంది.

తనీనాడు తన మహోన్నత ఆదర్శాల శిఖరాలనుండి, అధఃపాతాళానికి పడిపోయాడు. నింగినుండి నేలకు దొర్లిపోయాడు.

* * *

విమానం లాండ్‌కాబోతూ, రన్‌వే మీద పెద్ద చప్పుడుతో పరుగుతీస్తోంది. ఒక్కసారిగా అంజిరెడ్డి ఆలోచన్లు ఆగిపోయాయి. గత దృశ్యాలు మాయమయ్యాయి. వర్తమానంలోకి వచ్చింది అతగాడి మనస్సు.

విమానం నేలను తాకింది. ఇందాకా గగనంలో విహరించిన విమానం, నేలమీద నిల్చుంది.

విమానాశ్రయంలో శారద, పిల్లలు, తల్లి, తండ్రి, బంధువులు, స్నేహితులు నిల్చుని వున్నారు పూలమాలలతో. వాళ్ళందరి కళ్ళలో అతగాడికి కనిపిస్తున్నది ప్రేమ, అభిమానమూ, వాత్సల్యమూ కాదు.... డబ్బు.... డబ్బు.... తనవెంట వచ్చే పెద్ద పెద్ద సూట్‌కేసులు, వాటిల్లోవుండే ఖరీదైన వస్తువులూ.... చెక్కులూ.... అవే.... అవొక్కటే వాళ్ళకి కావల్సినవి. ఓ పది నిముషాలక్రితం ఆ విమానం నేలను తాకకుండా, ఆకాశంలోనే ప్రమాదానికి గురై కాలిపోయివుంటే? తనిలా వీళ్ళ మధ్యకి, నేలమీదకు రాకుండా సరిపోయేది. అలా జరగలేదు..

అంజిరెడ్డి నిర్లిప్తంగా అడుగులు వేశాడు నేలమీదకు....